సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం ၊ 25 ၊ జూన్ ၊ 2024



స్థిరంగా చీనీ ధరలు

చీనీ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు, కనిష్టంగా రూ.12 వేలు పలికాయి.



ఫిర్యాదులపై తక్షణం స్పందించండి

ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ విష్ణు పోలీసులను ఆదేశించారు.

8లో

గరిష్టం/కనిష్టం

35.4°/22.3°

జిల్లా పరిధిలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ సేవలు



సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ కోసం రక్తం అందిస్తున్న రోగి బంధువులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. డెంగీ, మలేరియా తదితర దోమకాటు వ్యాధులతో రోగుల్లో ప్లేట్‌లెట్స్ అమాంతంగా పడిపోతాయి. అటువంటి పరిస్థితుల్లో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ (ఎస్‌డీపీ) అందిస్తే ప్లేట్‌లెట్స్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉంటుంది. ప్రైవేట్‌గా ఇటువంటి సేవలు పొందాలంటే రూ.15 వేలకు పైగానే వెచ్చించాల్సి ఉంటుంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ మిషన్ ఏర్పాటు చేయడం ద్వారా రోగులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ నెల 1న బత్తలపల్లికి చెందిన దాసరి పుష్కలత, ఈ నెల 14న ఉరవకొండకు చెందిన మహేష్, ఈ నెల 15న అనంతపురం నగరానికి చెందిని శివారెడ్డి, ఈ నెల 18న రంగంపేటకు చెందిన వన్నూర్‌బీకి ప్లేట్‌లెట్స్ సేవలు పొందారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు.

రాజకీయ నేత బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయం

మడకశిర: మండలానికి చెందిన ఓ రాజకీయ నేత బ్యాంక్ ఖాతా నుంచి రూ.3.35 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. తన బ్యాంక్ ఖాతా నుంచి నగదు డ్రా అయినట్లుగా ఫోన్‌కు మెసేజ్‌లు అందడంతో అప్రమత్తమైన సదరు రాజకీయ నాయకుడు వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదించారు. నగదు డ్రాకు సంబంధించి తమకు ఎలాంటి సంబంధమూ లేదని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని బ్యాంక్ మేనేజర్ సూచించినట్లు తెలిసింది.

కాశీ యాత్రకు బస్సు సర్వీసు ప్రారంభం



కాశీ యాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న డీపీటీఓ మధుసూదన్, తదితరులు

హిందూపురం: అయోధ్య, కాశీ యాత్రకు హిందూపురం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సూపర్ లగ్జరీ బస్సు సేవలను జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. మొత్తం ఎనిమిది రోజుల యాత్రలో 14 పుణ్యక్షేత్రాల దర్శనం ఉంటుందని ఆయన తెలిపారు. శంషాబాద్ వద్ద ఉన్న రామానుజాచార్యుల ఆలయం, యాదగిరిగుట్ట, నిజామాబాద్, బాసర సరస్వతి దేవాలయం, అలహాబాద్‌లోని త్రివేణి సంగమం, అయోధ్య శ్రీరామ ఆలయం, కాశీ క్షేత్ర దర్శనం ఉంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, అమరావతి, కోటప్పకొండ, శ్రీశైలం, యాగంటి క్షేత్రాలను దర్శించుకుని హిందూపురం చేరుకుంటుందన్నారు. ప్రయాణానికి ఒకరికి రానుపోను చార్జీ కింద రూ. 8,500 వసూలు చేస్తారన్నారు. అలాగే జూలై 12, ఆగస్టు 9వ తేదీల్లో కాశీ యాత్రకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యాత్ర చేయదలుచుకున్న వారు 94408 34715కు ఫోన్ చేసి టికెట్లు రిజర్వ్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హిందూపురం డిపో మేనేజర్ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ హంపన్న, మెకానికల్ ఇంజనీర్ నిశాంత్ పాల్గొన్నారు

గురుకులాల్లో 25లోపు చేరండి

- జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల (అంబేడ్కర్ గురుకులాలు) పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 25లోగా చేరాలని గురుకుల విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణపత్రం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బ్యాంకు పాస్ బుక్ మొదటిపేజీ, ఫొటోలు, ర్యాంక్ కార్డ్, అలాట్‌మెంట్ కాపీ తీసుకెళ్లాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు గడువులోగా ఆయా స్కూళ్లలో చేరకపోతే మెరిట్ లిస్ట్‌తో తర్వాత సీరియల్‌లో ఉన్న విద్యార్థులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.

వంట.. తింటే తంటా!

- ఉమ్మడి అనంత జిల్లాలోని హోటళ్లలో దారుణ పరిస్థితులు
- అధ్వానంగా పారిశుధ్య పరిస్థితులు
- మరిగించిన నూనెలతో ప్రజల ఆరోగ్యం గుల్ల
- అధికారుల తనిఖీల్లో బహిర్గతం

❒ అనంతపురంలోని అరవిందనగర్, రామ్‌నగర్‌లోని రెండు హోటళ్లను గత బుధవారం అధికారులు తనిఖీ చేశారు. ఇడ్లీ, ఇతర టిఫిన్ వంటకాలపై ఈగలు వాలి ఉండడం గుర్తించారు. వేడి ఆహార పదార్థాలను ప్లాసిక్ కవర్లలో పార్సిల్ చేస్తున్నట్లు తేలింది. దీంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా సురక్షిత ప్రమాణాలు పాటించని ఆహారాన్ని మనం తింటామా అని చురకలంటించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వాడకూడదని స్పష్టం చేశారు.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: నెలకో, వారానికో హోటల్‌కెళ్లి భోజనం చేయాలనే కుటుంబాలు ప్రస్తుతం వేలల్లో ఉన్నాయి. రోజూ ఇంట్లో తిని బోర్ కొట్టిన ఫ్యామిలీలు వారాంతపు రోజుల్లో రెస్టారెంట్లకెళ్లి తినడం ఇటీవల ఆనవాయితీగా మారింది. కంటికి ఇంపుగా కనిపించే రంగులు, ఘుమఘుమలాడించే పొడులు చల్లి చేసిన వంటకాలకు ఆకర్షితులైన ప్రజలు రెస్టారెంట్లకు క్యూ కడుతున్నారు. అయితే, సంతోషంగా వచ్చే అలాంటి కుటుంబాలకు హోటళ్ల నిర్వాహకులు రోగాలను పరిచయం చేస్తున్నారు.

ఏ హోటల్ కెళ్లినా అంతే..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 150 వరకూ రిజిస్టర్ హోటళ్లు ఉన్నాయి. ఇటీవలి కాలంలో సుమారు 90 హోటళ్లలో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాల అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో హోటళ్ల డొల్లతనం బయటపడింది. అక్కడి అధ్వాన పరిస్థితులు అధికారులను విస్తుగొల్పాయి. ఆహారాన్ని రోజుల తరబడి నిల్వ చేయడం, పదే పదే అదే నూనెను వాడుతూ భోజన ప్రియుల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్నట్లు వెల్లడైంది. బయట పూత.. లోపల రోత అన్నట్లు పలు రెస్టారెంట్లు డస్ట్‌బిన్లను తలపించాయి. పారిశుధ్యం అత్యంత దారుణంగా ఉన్నట్లు తేలింది. ముఖ్యంగా మాంసాహార హోటళ్ల కిచెన్లు మురికి కూపాలను తలపించాయి. ఇక్కడ వండిన మాంసమా మనం తింటున్నది అంటూ అధికారులే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఏ హోటల్‌లో చూసినా ఇదే పరిస్థితి. మటన్, చికెన్ వంటివి మిగిలితే వారం, పది రోజుల వరకూ నిల్వ ఉంచి మళ్లీ వాటిలోనే ఆహార పదార్థాలను వండి వార్చుతున్నట్లు తెలిసింది.

పదే పదే నూనెలు మరిగించి

హోటళ్లలో వాడే నూనెలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా కొన్ని నమూనాలు సేకరించి, పరిశీలన చేయగా క్యాన్సర్ కారకాలు ఉన్నట్లు తేలింది. దీంతో పాటు ఆకర్షించే కార్సినోజెనిక్ రంగులను వాడుతుండడం గుర్తించారు. కనీస పారిశుధ్యం లేకపోవడం ఒకెత్తయితే నాసిరకం ఆహార పదార్థాలు, నిల్వ ఉంచినవి, మరిగించిన నూనెలు ఇలా ఒకటి కాదు రెండు కాదు హోటళ్ల రోగాలకు నిలయాలుగా మారుతున్నట్టు తేలింది. దీనిపై పకడ్బందీగా దాడులు చేయడం, జరిమానాలు విధించడం వంటివి లేకపోవడంతో హోటళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

> “
> **తనిఖీలు ముమ్మరం చేస్తాం**
>
> ఇటీవల హోటళ్లలో తనిఖీలు నిర్వహించాం. అక్కడ ఏ మాత్రం పరిస్థితులు బాగాలేవు. 90 శాతం నమూనాలు నెగిటివ్‌గా ఉన్నాయి. ఇప్పటికే చాలా హోటళ్లకు నోటీసులు ఇచ్చాం. తనిఖీలు మరింత ముమ్మరం చేశాం. ఇకపైనా తనిఖీలు నిర్వహిస్తాం.
>
> – చక్రవర్తి, ఫుడ్‌సేఫ్టీ అధికారి



నిల్వ చేసిన మాంసం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో..

రిజిస్టర్ అయిన పెద్ద హోటళ్ల సంఖ్య	150
ఎలాంటి లైసెన్సులూ లేకుండా నడుస్తున్నవి	1500పైనే
చిన్న చిన్న బడ్డీ కొట్లు	3000పైనే
భోజనం మెస్‌లు	250వరకూ



అనంతపురంలో ఓ రెస్టారెంట్‌లో అపరిశుభ్రత

ప్రతి సమస్యా పరిష్కారం కావాలి



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో మూడు నెలల అనంతరం ముందస్తు సమాచారం లేకుండా సోమవారం కలెక్టరేట్‌లో 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీపీఓ విజయ్‌కుమార్, గ్రామ /వార్డు సచివాలయాల నోడలాఫీసర్ శివారెడ్డి తదితరులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 106 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెబ్ పోర్టల్ ప్రారంభించినట్లు తెలిపారు. కలెక్టరేట్ తోపాటు మున్సిపల్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలన్నింటిలో అర్జీలు స్వీకరిస్తారన్నారు. అర్జీతో పాటు ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ పొందుపరచాలన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంఖ్యను కేటాయిస్తారన్నారు.

డయేరియా రహిత జిల్లాగా మార్చాలి..

కలెక్టరేట్ 'స్పందన' సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ డయేరియా రహిత జిల్లాగా మార్చడానికి అధికారులు కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో ఎక్కడా తాగునీరు కలుషితం లేకుండా, మురికి నీటి గుంతలు లేకుండా పంచాయతీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద క్లోరిన్ ట్యాబ్లెట్స్, బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. విద్యా సంస్థలు, జన సమూహ కూడళ్లు, మార్కెట్ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. నీటి నిల్వలు ఉన్న చోట గంబూషియా చేపలను వదలాలన్నారు. ఎక్కడైనా డయేరియా కేసులు వస్తే వెంటనే చికిత్స అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. మంచినీటి పైప్ లైన్లు ఎక్కడైనా లీకేజీలు ఉంటే మరమ్మతు చేయాలన్నారు.

ప్రాజెక్టులోకి దూకి వదిన, మరిది ఆత్మహత్య

- వివాహేతర సంబంధం బయటపడడంతో అఘాయిత్యం



మృతులు నిజామా, మహబూబ్ బాషా

పెద్దపప్పూరు: వివాహేతర సంబంధం బయటపడడంతో సమాజంలో తలదించుకుని బతకాల్సి వస్తుందని భావించిన వదిన నిజామా (39), మరిది మహబూబ్ బాషా (23) ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన పెద్దపప్పూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి కాలనీకి చెందిన జిలాన్ బాషా గుత్తి మండలం బేతాపల్లికి చెందిన నిజామాను వివాహం చేసుకుని అక్కడే జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. సొంత మరిది అయిన మహబూబ్‌బాషాతో నిజామాకు ఏడాదిగా వివాహేతర సంబంధం ఉండేది. ఇది తెలిసిన పలువురు మహబూబ్‌బాషాను మందలించి తాడిపత్రికి పంపారు. అయినా అతను అప్పుడప్పుడు గుత్తికి వెళ్లి వదినతో రహస్యంగా కలుస్తుండేవాడు. మూడు రోజుల క్రితం ఈ విషయం బహిర్గతమైంది. దీంతో అవమానంగా భావించిన వదిన, మరిది చనిపోవాలని నిర్ణయించుకుని ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో పెద్దపప్పూరు మండలం చాగల్లు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ అక్కడే వదిలి ప్రాజెక్టులోకి దూకారు. అక్కడ ద్విచక్ర వాహనం ఉండడాన్ని ప్రాజెక్టు సిబ్బంది గమనించి ఆదివారం రాత్రే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆరా తీయగా ద్విచక్ర వాహనం తన తమ్ముడిదేనని, రెండు రోజులుగా తన భార్య నిజామా, తమ్ముడు మహబూబ్ బాషా కనిపించడం లేదని మృతురాలి భర్త జిలాన్ బాషా పోలీసులకు తెలిపారు. కాగా.. సోమవారం ఉదయం చాగల్లు ప్రాజెక్టులోని మొదటి గేటు వద్ద నిజామా మృతదేహం తేలియాడుతుండగా ప్రాజెక్టు సిబ్బంది గమనించి పోలీసులకు తెలిపారు. ఇన్‌చార్జ్ ఎస్ఐ గౌస్‌బాషా సిబ్బందితో వెళ్లి గజ ఈతగాళ్ల సహాయంతో నిజామా మృతదేహాన్ని వెలికి తీయించారు. సాయంత్రం మహబూబ్‌బాషా మృతదేహం కూడా బయటపడింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పుడమికి పరీక్ష

- భూసార పరీక్షలకు కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో ఈసారి 35,800 నమూనాలు లక్ష్యం
- ఒక్కో నమూనా నుంచి 12 రకాల పోషకాల పరీక్షలు



అనంతపురంలోని మట్టి పరీక్షల ప్రయోగశాల

అనంతపురం అగ్రికల్చర్: భూసార పరీక్షలు భారీ ఎత్తున నిర్వహించడానికి వ్యవసాయశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. అనంతపురం జిల్లా పరిధిలో 18,600, శ్రీ సత్యసాయి జిల్లాలో 17,200... వెరసి ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 35,800 మట్టి నమూనాలు రైతుల పొలాల్లో సేకరించి వాటిని ప్రయోగశాలలో పరీక్షించి పోషక ఫలితాలు ఇవ్వాలని టార్గెట్‌గా నిర్ణయించారు. అయితే జిల్లా స్థాయి భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ-ఎస్‌టీఎల్) రెండు జిల్లాలకు కలిపి అనంతపురంలో ఉన్నందున... అదనంగా ధర్మవరం, పెనుకొండలో ఉన్న డివిజన్ స్థాయి కేంద్రాలను కూడా తిరిగి తెరవాలని, అలాగే మూలనపడిన మొబైల్ బస్సును కూడా అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపట్టారు. లేదంటే ఏడాదిలో ఇంత పెద్ద మొత్తంలో మట్టి పరీక్షల నిర్వహణకు కష్టమని చెబుతున్నారు. అందులోనూ ఇప్పటికే ఖరీఫ్ పంటల సాగు ప్రారంభించినందున మట్టి నమూనాలు తీయలేని పరిస్థితి ఉందంటున్నారు. ప్రస్తుతం నల్లరేగడి భూముల్లో శ్యాంపిల్స్ సేకరించడానికి అవకాశం ఉండటం, ఖరీఫ్ ముగిసిన తర్వాత అక్టోబర్-నవంబర్‌లో అలాగే వేసవిలో మార్చి నుంచి మే వరకు టార్గెట్‌ను పూర్తీ చేయడంపై దృష్టి సారించారు. ఆర్‌బీకే అసిస్టెంట్లు, ఏఈవోలు, ఏఓలకు టార్గెట్లు ఇచ్చి ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణ, ల్యాబ్‌కు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

12 రకాల మట్టి పరీక్షలు..

సేకరించిన మట్టిలో పోషకాలకు సంబంధించి ప్రయోగశాలలో 12 రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. అందులో పీహెచ్ (భూమి స్థితి) శాతం ఎలెక్ట్రికల్ కండక్టర్ (ఈసీ), ఆర్గానిక్ కర్బన్ (ఓసీ), నైట్రోజన్ (ఎన్), ఫాస్పరస్ (పీ), పోటాష్ (కే), సల్ఫర్, బోరాన్, ఐరన్, కాపర్, జింక్, మాంగనీస్ లాంటి స్థూలపోషకాలు (మ్యాక్రో న్యూట్రియంట్స్), అలాగే సూక్ష్మపోషకాలు (మైక్రో న్యూట్రియంట్స్) శాతం విశ్లేషించి క్రోడీకరిస్తామని తెలిపారు. దీని వల్ల భూమిలో ఉన్న పోషకాల లభ్యత, అధికం, తక్కువగా ఉన్న పోషకాల ఆధారంగా పంటలను బట్టి సమగ్ర ఎరువుల యాజమాన్యం సిఫారసు చేయనున్నట్లు ఎస్‌టీఎల్ ఏడీఏ ఎల్.రోజాపుష్పలత తెలిపారు. ప్రతి రైతు కనీసం మూడేళ్లకోసారి మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయన్నారు. దీని వల్ల భూమి సుర‌క్షంగా ఉండటమే కాకుండా రైతులకు, పంటలకు రక్షణగా ఉంటుందన్నారు. ప్రధానంగా భూమిలో సేంద్రియ కర్బనం పెరగడం వల్ల పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. జేడీఏ ఆదేశాల మేరకు రెండు జిల్లాల పరిధిలో భూసార పరీక్షల లక్ష్యం పూర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నామినేటెడ్ పదవులపై దృష్టి

- టీడీపీ నాయకుల ప్రయత్నాలు



- పెనుకొండ నియోజకవర్గంలో మంత్రి సవితకు ఎన్నికల్లో అండగా ఉన్న మండల స్థాయి టీడీపీ నాయకుడు ఒకరు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టు దక్కించుకొనేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎన్నికల్లో తానెంతో కష్టపడ్డానని.. తనకు రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పోస్టు ఇప్పించాలని ఒత్తిడి తెస్తున్నారు.
- హిందూపురం పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు ఒకరు తాను ఎన్నికల్లో అహర్నిశలు ఎమ్మెల్యే వెంటే ఉన్నానని, నిలబడి ఓట్లు వేయించానని, తనకు మార్కెట్ యార్డ్ లేదా అందుకు సమానమైన నామినేటెడ్ పోస్టు ఇవ్వాలని ఎమ్మెల్యే పీఏలను కోరుతున్నాడు.
- మడకశిర నియోజకవర్గంలోని టీడీపీ మండల నాయకుడు తనకు అహుడాలో చైర్మన్ లేదా డైరెక్టర్ పోస్టు ఇప్పించాలని నియోజకవర్గ సీనియర్ నాయకునిపై ఒత్తిడి తెస్తున్నారు.
- కదిరికి చెందిన ఓ మైనార్టీ నాయకుడు తాను ఎన్నికల్లో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నిలబడి ఎమ్మెల్యేకు తోడుగా ఉన్నానని, తనకు వక్ఫ్ బోర్డు లేదా మరేదైనా నామినేటెడ్ పోస్టు ఇప్పించాలని పైరవీలు చేస్తున్నాడు.

హిందూపురం అర్బన్: రాష్ట్రంలో టీడీపీ-జనసేన, బీజేపీ ప్రభుత్వం కొలువు దీరడంతో నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ నేతలు పైరవీలు చేస్తున్నారు. పదవులు ఆశిస్తున్న పలువురు నాయకులు వారం రోజులుగా తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పార్టీకోసం కష్టపడి పనిచేసిన నాయకులకు పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని వారు అధిష్టానం, ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకుంటున్నారు. హిందూపురంలోని ఓ నాయకుడు, నియోజకవర్గంలోని మరో నాయకుడు హిందూపురం మార్కెట్‌యార్డ్‌పై కన్నేశారు. అక్కడ చైర్మన్ కుర్చీ కోసం ఇప్పటి నుంచే పోటీ పడుతూ.. ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. అలాగే పట్టణంలోని పేట వేంకటరమణ స్వామి దేవాలయం, గుడ్డం రంగనాథస్వామి దేవాలయం, లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం, చిలమత్తూరు లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీలతో పాటు మడకశిర నియోజకవర్గంలోని పలు ఆలయాల నూతన కమిటీల్లో స్థానం దక్కించుకునేందుకు పైరవీలు చేస్తున్నారు. వీరితో పాటు జనసేన, బీజేపీ నాయకులు సైతం పలు నామినేటెడ్ పోస్టులు దక్కించుకొనేందుకు పై రవీలు చేస్తున్నారు. కదిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కోసం ఎమ్మెల్యే వెంట ఉండే ముఖ్య నేతలు నలుగురు పోటీ పడుతుండగా.. ఎమ్మెల్యే బిజీలో ఎవ్వరికీ అందుబాటులో లేకపోవడంతో ఎవరి దారుల్లో వారు ప్రయత్నాలు చేస్తున్నారు. కదిరికి చెందిన ఓ మైనార్టీ నాయకుడు వక్ఫ్ బోర్డులో స్థానం దక్కించుకొనేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. పెనుకొండకు చెందిన ఓ నాయకుడు అహుడా చైర్మన్ లేదా రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవి ఇప్పించాలని ఒత్తిడి తెస్తున్నారు. అయితే మంత్రి బిజీగా ఉండటం .. ఆదివారమే పెనుకొండకు రావడంతో మంత్రి దృష్టికి తీసుకెళ్లి పదవి దక్కేలా చూస్తానని మంత్రికి అత్యంత సన్నిహితుడు చెప్పుకొస్తున్నారు. జిల్లాస్థాయిలో స్టోర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, యానిమేటర్లు , మధ్యాహ్న భోజన ఏజెన్సీలలో తమ వారికి ఇప్పించేలా ఓ నాయకుడు ధర్మవరం బీజేపీ ఎమ్మెల్యేపై ఒత్తిడి తెస్తున్నారు.

ఆదాయ వనరులపైనా దృష్టి ..

తెలుగు తమ్ముళ్లు శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఆదాయ వనరులు ఎక్కడెక్కడ ఉన్నాయి? వాటిని ఎలా దక్కించుకోవాలి అన్న విషయంలో ఎవరికి వారు ఒకరికి తెలియకుండా మరొకరు పైరవీలు చేస్తున్నారు. ఇక నామినేటెడ్ పదవుల్లోనూ ఇదే ఫార్ములా వాడుతున్నారు.

క్లుప్తంగా

వీరభద్రుడి సేవలో అసిస్టెంట్ కలెక్టర్లు


ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్లు

లేపాక్షి: చరిత్రాత్మకమైన వీరభద్రస్వామి ఆలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్లు సీహెచ్ కళ్యాణి, భావన, బొల్లిపల్లి వినూత, దామోర హిమ వంశీ, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, శుభమ్ నోఖ్వాల్ సోమవారం సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు శ్రీనివాసులు, నరసింహశర్మ స్వాగతం పలికారు. దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ విశేషాలను వివరించారు. వారి వెంట ఆలయ ఈఓ నరసింహమూర్తి, తహసీల్దార్ బాలనరసింహులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నకిలీ అధికారులపై ఫిర్యాదు చేయండి

సాక్షి ఎఫెక్ట్..

పుట్టపర్తి టౌన్: నకిలీ అధికారులపై ఫిర్యాదు చేయాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర పిలుపునిచ్చారు. వివిధ శాఖలకు చెందిన అధికారులమంటూ కొందరు అక్రమ వసూళ్లకు తెరలేపిన అంశంపై 'కేటుగాళ్లు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఆయన స్పందించారు. జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా బేకరీలు, హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలు, చిల్లరకొట్టు తదితరాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ తనిఖీలకు వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. తనిఖీల సమయంలో డబ్బు డిమాండ్ చేస్తే తక్షణమే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. తనిఖీలకు వచ్చిన వారి గుర్తింపు కార్డు వివరాలు తెలుసుకోవాలన్నారు. అలాగే అనుమానితులపై వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించి నకిలీ అధికారుల ఆట కట్టించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

డిగ్రీ అడ్మిషన్లపై సందిగ్ధం

- అడ్మిషన్లపై ఎలాంటి ప్రకటన చేయని ఉన్నత విద్యామండలి
- అయోమయంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం
- ఇతర కోర్సుల వైపు విద్యార్థుల మొగ్గు
- అడ్మిషన్లకు ఆఫ్‌లైన్ లేక ఆన్‌లైన్ అని తేల్చుకోలేక పోతున్న విద్యామండలి
- కొత్త ప్రభుత్వం నుంచి రాని కబురు



ఉమ్మడి జిల్లాలో మొత్తం డిగ్రీ కళాశాలలు	95
ప్రభుత్వ యాజమాన్యంలోని కళాశాలలు	13
ప్రైవేట్ యాజమాన్యంలోని కళాశాలలు	82
గత ఏడాది అడ్మిషన్ పొందిన విద్యార్థుల సంఖ్య	12 వేలు
అన్ని గ్రూపులు కలిపి మొత్తం డిగ్రీ విద్యార్థుల సంఖ్య	25 వేలు
అడ్మిషన్ల జాప్యం ప్రభావం చూపుతున్న విద్యార్థుల సంఖ్య	13 వేలకు పైగా

తాడిపత్రి రూరల్: కొత్తగా యూజీ (డిగ్రీ) కోర్సుల్లో చేరబోయే విద్యార్థులకు అప్పుడే కష్టాలు మొదలయ్యాయి. విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఇప్పటి వరకూ డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయక పోవడంతో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ విద్య వైపు దృష్టి సారించాల్సి వస్తోంది.

ఫలితాలు వెలువడి 73 రోజులు కావస్తున్నా...

ఈ ఏడాది ఏప్రిల్ 12న ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడ్డాయి. ఫలితాలు వెలువడి దాదాపు 73 రోజులు కావస్తున్నా... నేటికీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలపై స్పష్టత లేకుండా ఉంది. ఈ నెల 18న ఇంటర్ ద్వితీయ సంవత్సర సప్లి ఫలితాలు వెలువడడంతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరూ ఉన్నత విద్యావకాశాలపై దృష్టి సారించారు. ఏటా ఇంటర్ ఫలితాలు వెలువడిన అనంతరం డిగ్రీలో ప్రవేశాలకు విధి విధానాలను ఉన్నత విద్యామండలి రూపొందించి, నోటిఫికేషన్ జారీ చేస్తోంది. దీని ప్రకారం ఆయా కళాశాలల యాజమాన్యం అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతూ వచ్చాయి. గత ఏడాది సైతం జూన్ 20న అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. సకాలంలో అడ్మిషన్లు చేపట్టినప్పుడే అరకొరగా విద్యార్థులు కళాశాలల్లో చేరుతున్నారని, ఇక ఆలస్యంగా అయితే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందనే ఆందోళన కళాశాలల యాజమాన్యాల్లో వ్యక్తమవుతోంది.

ఆన్‌లైన్ అడ్మిషన్లతో నూతన ఒరవడి..

గతంలో డిగ్రీలో ప్రవేశాలకు ఆఫ్‌లైన్ ద్వారా అడ్మిషన్లను చేపట్టేవారు. దీంతో పట్టణ ప్రాంతాల్లోని కళాశాలలకు డిమాండ్‌కు ఎక్కువగా ఉండేది. పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉండే కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య అరకొరగా ఉండేది. దీంతో వెనుకబడిన విద్యార్థులు చాలా నష్ట పోయేవారు. ఈ సమస్య నుంచే విద్యార్థులకు ఊరట దక్కేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ అడ్మిషన్లకు శ్రీకారం చుట్టింది. దీంతో ఆధునిక వసతులున్న కళాశాలలను ఎంపిక చేసుకునే వెసులుబాటు విద్యార్థులకు కల్పిస్తూ 2021 నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్లను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపులు చేయడంతో ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు ఉన్న కళాశాలల్లో చాలా సులువుగా సీట్లు దక్కాయి. అంతేకాక జగనన్న విద్యా దీవెనను సమర్థంగా అమలు చేయడంతో ఉన్నత విద్య ఓ వెలుగు వెలిగింది.

అడ్మిషన్లపై చొరవ చూపని ప్రభుత్వం..

డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లపై నూతన ప్రభుత్వం చొరవ చూపడం లేదనే భావన కళాశాలల యాజమాన్యాల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం కనిపిస్తోంది. ఏపీ మంత్రుల పోర్ట్‌ఫోలియోలో ప్రత్యేకంగా విద్యాశాఖ అని పేర్కొనకపోవడంతో ఈ శాఖ ఎవరికీ కేటాయించలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రభుత్వం ప్రత్యేకంగా మానవ వనరుల అభివృద్ధి శాఖగా పేర్కొంటూ ఇందులో పాఠశాల విద్యాశాఖ, ఉన్నత విద్య, అక్షరాస్యత పెంపు లాంటి అంశాలను చేరుస్తూ మంత్రిగా నారా లోకేష్‌కు బాధ్యతలను సీఎం చంద్రబాబు కేటాయించారు. ఈ క్రమంలో ఉన్నత విద్యామండలి అధికారులతో చర్చలు జరిపి డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసే దిశగా నారా లోకేష్ ఇప్పటి వరకూ చొరవ చూపకపోవడంతో సర్వత్రా గందరగోళం నెలకొంది. గతంలో కరోనా వల్ల గాడి తప్పిన విద్యా వ్యవస్థను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలతో చక్కబెట్టింది. తనకిచ్చిన శాఖల పట్ల నారా లోకేష్ పూర్తి స్థాయి అవగాహనకు వచ్చిన తరువాత అధికారులతో చర్చలు జరిపి చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తుండడంతో డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్‌లో చేపట్టాలా? లేకా ఆన్‌లైన్ ద్వారానా? అనే అంశం తేల్చుకోలేక ఉన్నత విద్యామండలి సందిగ్ధంలో పడింది.

ప్రత్యామ్నాయం వైపు విద్యార్థులు..

డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ జారీలో చోటు చేసుకుంటున్న జాప్యం కారణంగా విద్యాసంవత్సరం కోల్పోవడం ఇష్టం లేని విద్యార్థులు ప్రత్యామ్నాయ కోర్సుల వైపు దృష్టి సారిస్తున్నారు. దీనికి తోడు కళాశాలల యాజమాన్యాలు సైతం నోటిఫికేషన్ ఇప్పట్లో రాదనే భావనతో విద్యార్థులను భయపెడుతున్నాయి. దీంతో పలు ప్రైవేట్ విద్యాసంస్థలు పలు రకాల కోర్సులతో విద్యార్థులకు గాలం వేస్తున్నాయి.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

పావగడ: స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచురాజనహళ్లి గ్రామ శివారులో ఉన్న నీలగిరి వనం వద్ద వృద్ధురాలి హత్య కేసులో అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మడకశిర మండలం ఎల్లోటి గ్రామానికి చెందిన వృద్ధురాలు వడ్డె చంద్రక్కను గత గురువారం నీలగిరి వనం వద్ద గొంతు కోసి హతమార్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో హతురాలి కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు... ఆ మరుసటి రోజే ఆంజనేయులు, ఆయన భార్య రాధ, అల్లుడు ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు... హతురాలు చంద్రక్క తన పేరిట ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని తన కుమార్తెకు రాసిస్తానని చెప్పడంతో కోపోద్రిక్తులైన కుమారుడు, కోడలు, అల్లుడు ఆమెను ఎలాగైనా హతమార్చి ఆ భూమిని తమ పేరిట చేసుకోవాలని కుట్ర పన్నారు. ఈ క్రమంలో పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకున్న వారు గురువారం మాచరాజనహళ్లి పరిసరాల్లో మద్యం సేవించి తిరిగి వెళుతుండగా చంద్రక్క గొంతు కోసి హతమార్చినట్లుగా తెలిసింది. దీంతో అనుమానితులుగా హతురాలి కుమారుడు, కోడలు, అల్లుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టారు. రెండు మూడు రోజుల్లో వారిని అరెస్ట్ చూపే అవకాశమున్నట్లు సమాచారం.

యువతకు ఉచిత శిక్షణ

లేపాక్షి: నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ మేరకు నాక్ ఏడీ గోవిందరాజులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి ల్యాండ్ సర్వేయింగ్, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. 18 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉన్న వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28వ తేదీ లోపు ఆధార్, రేషన్ కార్డు నకళ్లు, అర్హత ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో హిందూపురంలోని ముక్కడిపేటలో ఉన్న పాత ఎస్సీ బాలురు హాస్టల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి. పూర్తి వివరాలకు 90529 01657, 91105 50779లో సంప్రదించవచ్చు.

వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా విజయశంకర్‌బాబు



బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా డాక్టర్ విజయ శంకర్ బాబు నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ సహదేవరెడ్డిని రాజమండ్రి వ్యవసాయ పరిశోధనా స్థానానికి బదిలీ చేశారు. ఈ క్రమంలో పులివెందులలోని వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి డాక్టర్ విజయశంకర్‌బాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు ప్రారంభం


ఎస్కేయూలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్లు


జేఎన్‌టీయూలో ఇంటర్వ్యూ చేస్తున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం: ఏపీ రీసెట్-2024లో అర్హత పొందిన అభ్యర్థులకు పీహెచ్‌డీలో ప్రవేశాలకు సోమవారం నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వర్సిటీలకు ఇంటర్వ్యూలు చేపట్టడానికి కొన్ని సబ్జెక్టులు చొప్పున కేటాయించారు. ఈ నేపథ్యంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి కేటాయించిన ఇంగ్లిష్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్సెస్, సెరికల్చర్ సబ్జెక్టుల్లో ఇంటర్వ్యూలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇంగ్లిష్ బోర్డ్ ఆఫ్‌స్టడీస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ పుత్తా పద్మ, ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి. మాధవి, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ప్రొఫెసర్ వైఎస్ శారద, ప్రొఫెసర్ వి.నిర్మల ఆధ్వర్యంలో అభ్యర్థుల అర్హత పత్రాలు పరిశీలించి, ఇంటర్వ్యూలు నిర్వహించారు.

జేఎన్‌టీయూలో...

జేఎన్‌టీయూఏ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు సోమవారం ప్రారంభమయ్యాయి. సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్సెస్, కెమికల్ విభాగాల్లో చేపట్టిన ఇంటర్వ్యూలను వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఏపీఆర్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, ప్రొఫెసర్ సి.శోభాబిందు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, ప్రొఫెసర్ ఏపీ శివకుమార్ పాల్గొన్నారు.

చీనీ, దానిమ్మకు చీడపీడలు


కొత్తచిగురు తినే పురుగు ఆశించడంతో చీనీ ఇలా


బ్యాక్టీరియా మచ్చతెగులు కారణంగా దెబ్బతిన్న దానిమ్మ కాయ

- నివారణ చర్యలు చేపట్టండి
- ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్

అనంతపురం అగ్రికల్చర్: తాజా వాతావరణ పరిస్థితుల్లో చీనీ, దానిమ్మకు ఆశించిన చీడపీడల నివారణపై దృష్టి సారించాలని ఉమ్మడి జిల్లా రైతులకు ఉద్యానశాఖ శ్రీసత్యసాయి జిల్లా డీడీ జి.చంద్రశేఖర్ సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ విస్తీర్ణంలో ఉన్న చీనీ తోటలు, దానిమ్మ తోటల్లో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను ఆయన వివరించారు.

చీనీలో సస్యరక్షణ చర్యలు ఇలా...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం చీనీ తోటల్లో సీజన్ కాయ ఎదుగుదల దశలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తగా చిగుర్లు వచ్చాయి. వచ్చే గైరంగం పంట మంచి దిగుబడులు రావాలంటే చిగుర్లు ఆరోగ్యంగా పెరిగేలా కాపాడుకోవాలి. అయితే చాలా తోటల్లో రెక్కల పురుగులు ఆశించి చిగుర్లను తినేస్తున్నాయి. అలా జరిగితే వచ్చే సీజన్‌లో పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. దీని నివారణకు లీటర్ నీటికి 0.3 గ్రాముల థయోమిథాక్సామ్ కలిపి పిచికారీ చేయాలి. అలాగే అక్కడక్కడ పాముపొడ (లీఫ్‌మైనర్) పురుగులు ఆశించి పత్రహరితాన్ని హరింపజేస్తున్నాయి. దీని నివారణకు లీటర్ నీటికి 1 మి.లీ అబామిక్టిన్ బెంజోయేట్ కలిపి పిచికారీ చేయాలి. కొత్త చిగుర్లు పగిలి లేత ఆకులు ఏర్పడే దశలో 15 రోజుల వ్యవధిలో సిఫారసు చేసిన మోతాదులో సూక్ష్మధాతువుల మిశ్రమాన్ని రెండు సార్లు పిచికారీ చేయాలి.

దానిమ్మలో ఇలా...

దానిమ్మ తోటలు చాలా వరకూ వాడు దశ నుంచి పంటకు వెళ్లే దశలో ఉన్నాయి. పూత పిందె దశలో ఉన్న తోటల్లో ఇటీవల కురిసిన వర్షాలకు చీడపీడలు సోకే ప్రమాదముంది. ప్రధానంగా బ్యాక్టీరియా మచ్చతెగులు విషయానికి వస్తే... ఆకులు, కాయలపై కాటుక రంగులో 'వై' ఆకారపు మచ్చలు ఏర్పడి పగుళ్లు వస్తాయి. నివారణకు ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని పిందెలు ఉన్న తోటల్లో పిచికారీ చేయాలి. కొత్తగా పంటకు వెళ్లే తోటల్లో జాగ్రత్తగా కత్తిరింపులు చేయాలి. పూత దశలో ఉన్న తోటల్లో లీటర్ నీటికి 3 మి.లీ జీవశిలీంద్రనాశిని సూడోమోనాస్ కలిపి పిచికారీ చేయాలి. ఈ మందు పిచికారీ చేసిన తర్వాత 10 నుంచి 15 రోజుల వరకు మరే ఇతర మందులు పిచికారీ చేయకూడదు. అక్కడక్కడ రబ్బరు పురుగు ఆశించి కొత్త చిగుర్లను తింటూ నష్టం కలగజేస్తోంది. లీటర్ నీటికి 10 వేలు పీపీఎం కలిగిన 1 మి.లీ వేపనూనె + 2 మి.లీ కార్బోసల్ఫాన్ కలిపి పిచికారీ చేయాలి. ఇటీవల కురిసిన తొలకరి వర్షాలకు జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద, ఉలవలు లాంటి పచ్చిరొట్ట (గ్రీన్‌మెన్యూర్స్) విత్తనాలు చల్లి 60 రోజుల వయస్సులో భూమిలో కలియదున్నితే సేంద్రియ పోషకాలతో భూసారం పెరుగుతుంది.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

- అడిషనల్ ఎస్పీ విష్ణు ఆదేశం

పుట్టపర్తి టౌన్: ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ విష్ణు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ పాల్గొని బాధితుల నుంచి 21 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో అందిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు..

అదనపు కట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని అర్పియా అనే మహిళ అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఓడీచెరువు మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన తనకు ధర్మవరం పట్టణం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న సల్మాన్‌ఖాన్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైందని తెలిపింది. 15 తులాల బంగారం కట్నం కింద ఇచ్చారని పేర్కొంది. అయితే నాలుగు నెలల నుంచి అదనపు కట్నం కావాలంటూ భర్త వేధిస్తున్నాడని చెప్పింది. రెండు నెలల కిందట ధర్మవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు న్యాయం చేశారని తెలిపింది. కొద్ది రోజుల తర్వాత తిరిగి కట్నం కోసం మళ్లీ డిమాండ్ మొదలైందని, తన కుమారుడిని తన వద్దకు రాకుండా ఆడపడచు, ఆమె తల్లి అడ్డుకుంటున్నారని వాపోయింది. తనను చంపుతామని బెదిరిస్తున్నాడని ఆరోపించింది. అడిషనల్ ఎస్పీ స్పందిస్తూ సంబంధిత డీఎస్పీతో మాట్లాడి న్యాయం చేయాలని ఆదేశించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

కణేకల్లు: మండల కేంద్రంలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద సోమవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన ముగ్గురిపై దాడి చేసి గాయపరిచింది. వివరాలు... సోమవారం ఉదయం పాఠశాలకు వెళుతున్న చిన్నారులు హేమంత్, యాస్మీన్‌పై తొలుత పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. చిన్నారులు ఏడ్చుకుంటూనే స్కూల్‌కు వెళ్లారు. ఉపాధ్యాయుల నుంచి సమాచారం అందుకున్న తల్లిదండ్రులు పాఠశాల వద్దకెళ్లి పిల్లలను స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్నారు. కొద్ది సేపటి తర్వాత అదే కుక్క ఎర్రిస్వామి అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచడంతో ఆయన కూడా ఆస్పత్రికి చేరుకుని చికిత్స చేయించుకున్నారు. కణేకల్లులో వీధి కుక్కలు, పిచ్చికుక్కల బెడద తీవ్రంగా ఉన్నా... మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

26, 28 తేదీల్లో జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్ఎస్ సెక్యూరిటీ, సీయోన్ సమ్మిట్ ఆటోమేటివ్ అనంతపురం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో సెక్యూరిటీ సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డ్, గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ట్రైనీ, డిప్లొమా ఇంజినీరింగ్ ట్రైనీ ఉద్యోగాలకు ఈ నెల 26, 28 తేదీల్లో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి ఎ.కళ్యాణి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటలకు జరిగే జాబ్‌మేళాను ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఏదైనా ఐడీ ప్రూఫ్ వెంట తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 90145 28675లో సంప్రదించాలని పేర్కొన్నారు.

'పురం' స్నాచర్‌పై కర్ణాటకలో పోలీసుల కాల్పులు

- తుమకూరు జిల్లాలో సంఘటన


నిందితుడు రిజ్వాన్

తుమకూరు (కర్ణాటక): ఒంటరి మహిళల మెడలోని బంగారు ఆభరణాలను చోరీ చేస్తున్న దొంగపై పోలీసులు కాల్పులు జరిపి పట్టుకున్నారు. తుమకూరు జిల్లాలోని మధుగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈజిహళ్లి క్రాస్ వద్ద సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడు శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన రిజ్వాన్‌గా గుర్తించారు. ఇటీవల తుమకూరు జిల్లాలో జరిగిన పలు చైన్ స్నాచింగ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కర్ణాటక పోలీసులు పక్కా ఆధారాలతో రిజ్వాన్‌ను నిందితుడిగా నిర్ధారించి సోమవారం ఉదయం హిందూపురం వద్ద అరెస్ట్ చేశారు. అనంతరం తుమకూరుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో ఈజిహళ్లి క్రాస్ వద్ద బహిర్భూమికని చెప్పడంతో పోలీసులు జీపు ఆపారు. వాహనం దిగిన రిజ్వాన్ వెంటనే అక్కడే పడి ఉన్న బీరు బాటిల్‌ను పగలగొట్టి పోలీసులపై దాడి చేసి పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతనిపై కాల్పులు జరపడంతో చేతికి గాయాలయ్యాయి. వెంటనే అతన్ని మధుగిరి ఆస్పత్రిలో చేర్పించారు. సుమారు 15కు పైగా స్నాచింగ్‌ల్లో రిజ్వాన్ నిందితుడిగా తేలింది. విషయం తెలుసుకున్న తుమకూరు జిల్లా ఎస్పీ, డీఎస్పీ తదితరులు ఆస్పత్రికి చేరుకుని నిందితుడిని విచారణ చేశారు.

ఎన్‌టీఏ నూతన కార్యవర్గం ఎన్నిక


పీవీ శ్రీనివాసులు


రామలింగయ్య


గోపాలప్ప


శేషఫణి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో సోమవారం ఈ ఎంపిక ప్రక్రియ జరిగింది. రాష్ట్ర కౌన్సిలర్లుగా కె.హరికృష్ణ, జి. ప్రేమనాథరెడ్డి, బి నాగేంద్ర, ఎస్. రాంభూపాల్ రెడ్డి, ఆర్ నారాయణ నాయక్, ఎస్. వి. ఎస్ .శరత్ పామర్, అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా పీవీ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా హెచ్. గోపాలప్ప, గౌరవాధ్యక్షుడిగా పి. బాలసుబ్రహ్మణ్యం, సహాధ్యక్షుడిగా ఎస్. వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా ఎ. ఆదిశేషయ్య, ఎస్. వేణుగోపాల్, బి. ఈరాలప్ప, టి. జోష్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎస్. ఖలందర్, ఆర్థిక కార్యదర్శిగా పి. అల్లాబకాష్, కార్యదర్శులుగా పి. వహీద్, కె. ఖాజావలి, పి .మహబూబ్ ఖాన్, బి .రాఘవేంద్ర, కె శర్మాస్ వలి, ఆర్.నాగరాజు, జె.తిమ్మరాజు ఎన్నికయ్యారు.

= శ్రీసత్యసాయి జిల్లా కమిటీకి సంబంధించి రాష్ట్ర కౌన్సిలర్లుగా శేష ఫణి, ముస్తాక్ అహ్మద్, బి. రాంప్రసాద్, జిల్లా అధ్యక్షుడిగా ఎస్ . రామలింగయ్య, ప్రధాన కార్యదర్శిగా జి. శేష ఫణి, గౌరవాధ్యక్షుడిగా ఎం. వేణుగోపాల్, సహాధ్యక్షులుగా ఎస్ .శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షుడిగా పి.ఇర్షాద్ అహ్మద్, కాలువ మురళి, అక్కులప్ప, సి. శివన్న, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఇ. హనుమంతు, ఆర్థిక కార్యదర్శిగా జి. శ్రీనివాసులు, కార్యదర్శులుగా కె .ఎస్. జవహర్ కుమార్, పి .జయకృష్ణ, సి. జితేంద్ర, జి. శ్రీనివాసులు, కె. రంగస్వామి, బి. నరసింహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ పి. బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం. వేణుగోపాల్, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, అదనపు ప్రధాన కార్యదర్శి గుత్తి ప్రేమనాథరెడ్డి వ్యవహరించారు.